19 - 10 - 2009

గురువారం : 07/01/2010



సాక్షి

మీ నాన్నకు ఇతరులు సాధించిన స్పోర్ట్స్ రికార్డులు మాత్రమే తెలిసేవి.
మీరు పేజీ తిప్పితే చాలు, లోతైన విశ్లేషణలు.
స్పోర్ట్స్

Fire Fox users download the font



Bharat Matrimony
SEARCH



# పశుగ్రాసాల కొరతను నివారించాలంటే...



పాడి పైనే ఆధారపడే చిన్న, సన్నకారు రైతులకు పశుగ్రాస కొరత ఎదురైనప్పుడు పరి స్థితి అగవ్యగోచరంగా మారుతుంది. ఖరీఫ్‌లో వర్షాలు కురవకపోతే ఏర్పడే పశుగ్రాస కొరత తాత్కాలికమే అయినప్పటికీ పశువులపై దాని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. అందువల్ల కొన్ని ముందు జాగ్రత్తలు తీసుకొని, మెరుగైన యాజమాన్య పద్ధతులు అవలంబిస్తే భవిష్యత్తులో అన్నదాతలకు పశుగ్రాస కొరతన్నదే ఉండదు.

బంజరు భూముల్లో వర్షాలు పడకముందే సింకరస్, స్టైలో, స్వీట్ సూడాన్ వంటి గడ్డి జాతి విత్తనాలు చల్లుకుంటే మంచిది. అయితే ఆ పైర్లు బాగా పెరిగే వరకూ పశువులు మేయకుండా కట్టడి చేయాలి. పచ్చిమేతల పైర్లు ఎండిపోకుం డా ఉండాలంటే మొక్కల సాంద్రతను తగ్గించాలి.

అలా తగ్గించడం వల్ల మొక్కల మధ్య నీటి కోసం పోటీ తగ్గుతుంది. ఒకవేళ పైరు ఎండిపో తే దానిని జాగ్రత్తగా పోగు చేసుకుని పశువుల మేతగా వాడుకోవాలి. రైతులు తమకు అందు బాటులో ఉన్న బంజరు భూముల్లోనూ, అటవీ ప్రాంతాల్లో ఉన్న అన్ని రకాల భూముల్లోనూ హెక్టారుకు 20 కిలోల నత్రజని ఎరువు వేసుకుం టే దానిని ఉపయోగించుకుని గడ్డి బాగా పెరు గుతుంది. ఆ గడ్డిలో పోషక విలువలు పుష్కలం గా ఉంటాయి. తక్కువ గడ్డితో పశువులకు కావాల్సిన పోషక అవసరాలు తీర్చవచ్చు.

అత్యవసర సమయంలో
నీరు నిల్వ ఉన్న చెరువులు, కాలువల గట్ల మీద ఉండే కొద్దిపాటి నీటి తేమను ఉపయోగిం చుకుని అత్యవసర సమయంలో తాత్కాలిక పశుగ్రాసాలను (లూసర్న్, ఆఫ్రికన్ టాల్ మొద లైనవి) పెంచుకోవాలి. మురికి నీటి కాలువల కింద పారాగడ్డిని పెంచుకోవచ్చు.

నిల్వ
వర్షాలు బాగా కురిసినప్పుడు లభించే అన్ని రకాల పశుగ్రాసాలను, పశువుల మేతగా పనికి వచ్చే అన్ని రకాల పచ్చికలను, చెట్ల ఆకులను సేకరించి ఎండబెట్టి వామిగా వేసి నిల్వ చేసుకో వాలి. ఈ విధంగా నిల్వ చేసుకున్న మేతను వెంటనే వాడుకోవచ్చు. లేకుంటే అవసర మొచ్చినప్పుడు ఉపయోగించుకోవచ్చు.

పోషకాల పెంపు
అందుబాటులో ఉన్న ఎండుగడ్డిలోని పోషక విలువలను పెంచుకునే ప్రయత్నం ఎంతో ముఖ్యమైనది. ఇందుకోసం ప్రతి వంద కిలోల ఎండుగడ్డికి నాలుగు కిలోల యూరియా అవసరమవుతుంది. ముందుగా యూరియాను 60 లీటర్ల నీటిలో కలపాలి. ఆ ద్రావణాన్ని ఎండుగడ్డిపై సమానంగా పడేలా చల్లుకోవాలి. తర్వాత గడ్డిని వామిగా వేయాలి. ఈ విధంగా మాగ వేసిన వరి గడ్డిని మూడు వారాల తర్వాత వాడుకోవచ్చు.

ఈ గడ్డికి నాలుగు కిలోల మొలాసిస్ (బెల్లపు మడ్డి), ఒక కిలో ఖనిజ లవణాల మిశ్రమం, రెండు కిలోల ఉప్పు కలు పుకుంటే రుచి పెరిగి పశువులు ఇష్టంగా మేస్తాయి. ఎండుగడ్డిని యూరియా, మొలాసిస్ తో బలవర్ధకం చేసుకుంటే పశువులకు అవసరమైన మాంసకృత్తులు, పిండి పదార్థాలు పుష్కలంగా లభించి పాల ఉత్పత్తి పెరుగుతుంది.

ఇవి కూడా మేతలే...
వ్యవసాయ పరిశ్రమ ఉప ఉత్పత్తులైన పండ్ల గుజ్జు, పనికిరాని కూరగాయలు, ఆహార గిడ్డం గుల నుండి వచ్చే పాడైపోయిన ధాన్యపు గింజలను కూడా మేతగా వాడుకోవచ్చు.

కంది-పెసర-పప్పు దినుసుల పొట్టును, గోధు మ-వరి తౌడును, పల్లీలు-పొద్దుతిరుగుడు వంటి నూనెగింజల చెక్కను దాణా దినుసులు గా వాడుకోవచ్చు. దీనిలో కిలో ఖనిజ లవణాల మిశ్రమం, రెండు కిలోల ఉప్పు కలుపుకోవాలి.

ఎలా వాడుకోవాలంటే

అందుబాటులో ఉన్న గడ్డిని సక్రమంగా, సమర్థవంతంగా వాడుకోవాలి. పెద్దగా ఉన్న గడ్డిని చాప్‌కట్టర్ (నరికే యంత్రం)తో చిన్న చిన్న ముక్కలుగా చేసుకుని కొద్దిగా బెల్లం లేదా ఉప్పు కలిపిన నీటిలో నానబెట్టి పశువులకు మేపుకోవాలి.

దీనివల్ల కనీసం 20-25 శాతం వృథాను తగ్గించవచ్చు. అంతేకాక మామూలు గ్రాసంతో పోలిస్తే ఈ గడ్డి 15-20 శాతం ఎక్కువగా జీర్ణమవుతుంది.

విటమిన్ లోపాల నివారణ

పచ్చిమేతకు కొరత ఏర్పడినప్పుడు పశువులకు ఏ,డీ,ఈ విటమిన్ల లోపాలు వస్తాయి. వీటిని నివారించాలంటే దాణా మిశ్రమంలో విటమిన్ల మిశ్రమాన్ని కలిపి దాణాగా అందించాలి. ఇవే కాకుండా కాల్షియం, ఫాస్పరస్, మెగ్నీషియం లోపాల నివారణకు ఒక శాతం సున్నపు పొడిని దాణాలో కలిపి ఇవ్వాలి.

డాక్టర్ డి.సుధీర్,
డాక్టర్ యంయస్.ప్రసాద్,
కృషి విజ్ఞాన కేంద్రం (రంగారెడ్డి జిల్లా), క్రీడా

ఇప్పుడు బర్సీమ్, లూసర్న్ వేసుకోవచ్చు

బర్సీమ్, లూసర్న్ పశుగ్రాసాల విత్తనాలను ఇప్పుడు విత్తుకోవచ్చు. నీరు నిలువ ఉండే ఒండ్రుమట్టి నేలలు బర్సీమ్ సాగుకు అనువైనవి.

వెదజల్లే పద్ధతిలో ఎకరానికి 8-10 కిలోల విత్తనాలు అవసరమవుతాయి. విత్తేటప్పుడు ఎకరానికి ఎనిమిది కిలోల నత్రజని, 32 కిలోల భాస్వరం, 12 కిలోల పొటాష్ ఇచ్చే ఎరువులు వేసుకోవాలి. 5-7 రోజులకు ఒకసారి నీటి తడి ఇవ్వాలి. విత్తిన 50 రోజులకు మొదటి కోత కోయవచ్చు. తర్వాత 25 రోజుల వ్యవధిలో కోతలు కోసుకోవచ్చు. మూడు నాలుగు కోతలకు 35-45 టన్నుల పచ్చిమేత లభిస్తుంది.

లూసర్న్ సాగుకు నీరు నిలువ ఉండని ఒండ్రుమట్టి నేలలు, ఎర్ర ఇసుక నేలలు అనుకూలమైనవి. ఎకరానికి నాలుగైదు కిలోల విత్తనాలు అవసరమవుతాయి. వరుసల మధ్య 25-30 సెంటీమీటర్ల దూరం ఉండేలా చిన్న చిన్న మళ్లలో విత్తుకోవాలి. ఆఖరి దుక్కిలో ఎకరానికి ఎనిమిది కిలోల నత్రజని, 32 కిలోల భాస్వరం, 16 కిలోల పొటాష్ ఇచ్చే ఎరువులు వేసుకోవాలి. 10-15 రోజుల వ్యవధిలో నీటి తడులు ఇవ్వాలి. విత్తిన 50-60 రోజులకు మొదటి కోత, ఆ తర్వాత ప్రతి 25 రోజులకు తదుపరి కోతలు కోయవచ్చు. సంతోష్‌నగర్, హైదరాబాద్.

**More Headlines**

- ఈ మూడు పురుగులు ముంచేస్తాయి... జాగ్రత్త!
- సాధారణ సాగు... అసాధారణ దిగుబడి
- ఇటు వ్యవసాయం... అటు చేపల పెంపకం
- అవసరానికి మించితే అనర్థమే
- పాడి గేదెలు కొనేటప్పుడు జాగ్రత్త సుమా!
- ఇసుక నేలల్లో చామ సిరులు
- కాయతొలుచు పురుగు నివారణ ఎలా?

1

Back to Listing Page

(0) Comments so far

కామెంట్స్

Post Your Comments: